నేరం చేయాలంటే భయపడాలి

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోండి

పోలీసులకు హోంశాఖ మంత్రి అనిత ఆదేశం

(వివరాలు 6లో..)





అపార్.. బేజార్..!



అనంతలోని ఓ ఆధార్ సెంటర్‌లో రద్దీ

- ఆధార్, మీసేవ కేంద్రాలు కిటకిట
- మార్పులు చేర్పులకు విద్యార్థుల తంటాలు
- పల్లెల నుంచి పట్టణాలకు వందలాది మంది..
- ఆధార్, బర్త్ సర్టిఫికెట్లలో వేర్వేరుగా వివరాలు
- నత్త నడకన సవరణ ప్రక్రియ
- పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు టెన్షన్
- జిల్లాలో 3,71,416 మంది విద్యార్థులు
- 2,16,463 మంది అపార్ పెండింగ్

ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అపార్ ఐడీలు వణికిస్తున్నాయి. వారం పది రోజులుగా పల్లెల నుంచి పట్టణాలకు వందలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరుగులు తీస్తున్నారు. మీసేవా కేంద్రాలు, ఆధార్ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఈ వ్యవహారం పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 11వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఆలోగా ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవడం కష్టంగా మారింది. ఆధార్ కేంద్రాలలో రద్దీ కారణంగా పని ముందుకు సాగడం లేదు. కొన్ని సెంటర్ల నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. విద్యార్థుల ఇబ్బందులతో తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ స్పందించి.. పాఠశాలలు, గ్రామ, వార్డు సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.

- అనంతపురం విద్య (ఆంధ్రజ్యోతి)

ముప్పు తిప్పలు

విద్యార్థులకు అపార్ ఐడీల జనరేషన్ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. పాఠశాలల రికార్డులు, ఆధార్‌కార్డులు, యూ-డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు ఒకేలా ఉండాలన్న నిబంధన పెట్టారు. దీనికి తగినంత సమయం లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది విద్యార్థుల వివరాలు ఒకేలా లేవు. విద్యార్థి, తల్లిదండ్రుల వివరాల్లో ఎక్కడో ఒక చోట బేధం ఉంటోంది. వాటిని సవరించి, ఒకేలా తీసుకురావాలని పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. దీంతో పల్లెల నుంచి పట్టణాలు, అనంతపురం నగరానికి తల్లిదండ్రులు పోటెత్తుతున్నారు. ఆధార్ సవరణలకు విద్యార్థి బర్త్ సర్టిఫికెట్‌ను ఆధార్ సెంటర్ నిర్వాహకులు ప్రమాణికంగా తీసుకుంటున్నారు. బర్త్ సర్టిఫికెట్‌లో చిన్న తప్పు ఉన్నా.. నోటరీ చేయించుకు రావాలని ఆధార్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. బర్త్ సర్టిఫికెట్‌లో మార్పులు చేయించుకోవాలన్నా మీ సేవా కేంద్రాలకు, మున్సిపల్ కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.



అనంతపురం: ఇంతమంది ఉంటే.. వంతు వచ్చేదెప్పుడు..?

- ఉరవకొండ సెంట్రల్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న జయకృష్ణ ఇంటి పేరు ఆధార్‌లో తప్పుగా ఉంది. సరిచేయించుకునేందుకు గతంలో పలుమార్లు దరఖాస్తు చేశాడు. కానీ ఫలితం లేకపోయింది. దీంతో తండ్రి శ్రీనివాసులును వెంటబెట్టుకుని అనంతపురానికి వచ్చాడు.



- అనంతపురం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి పేరు డి.తస్వీష్. జనన ధ్రువీకరణ పత్రంలో తస్వీష్ అని ఉంది. ఆధార్ కార్డులో డి.టిని అని ఉంది. రెండింటిలో పేరు ఒకేలా ఉండేలా మార్పు చేయించుకురమ్మని పాఠశాల యాజమాన్యం సూచించింది. దీంతో తల్లిదండ్రులు ఆధార్ కేంద్రానికి వచ్చి పేరును మార్పించుకునేందుకు తంటాలు పడుతున్నారు.



వారికి టెన్షన్

పదో తరగతి విద్యార్థులకు చదువుల టెన్షన్‌కు అపార్ టెన్షన్ అదనంగా చేరింది. బర్త్ సర్టిఫికెట్, ఆధార్ మార్పులు అంటేనే భయపడిపోతున్నారు. పదో తరగతి మార్కుల జాబితాలో వివరాలు భవిష్యత్తుకు కీలకం. ఉన్నత విద్య, ఉద్యోగం.. ఏదైనా సరే.. ప్రామాణికం పదో తరగతి మార్కుల జాబితానే. 10వ తరగతి అంటేనే విద్యార్థులపై ఒత్తిడి ఉంటుంది. పరీక్ష ఫీజు కట్టే సమయం వచ్చింది. ఫైన్ లేకుండా 11వ తేదీ వరకూ ఫీజు కట్టవచ్చు. ఆ లోగా పాఠశాలల్లో అపార్ ఐడీ జనరేట్ కావాలి. దీనికోసం ఆధార్ కార్డుల్లో మార్పులు చేయించుకోవాలి. కానీ ఆధార్ సెంటర్లలో అంత వేగంగా పని జరగడం లేదు. ఆధార్‌కార్డులో మార్పులు ఆలస్యమైతే ఇబ్బందులు తప్పవని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

2,16,463 ఐడీలు పెండింగ్

జిల్లాలో 3,71,416 మంది విద్యార్థుల అపార్ ఐడీలు జనరేట్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 1,54,953 మంది ఐడీలు క్రియేట్ చేశారు. ఇంకా 2.16 లక్షల మంది ఐడీలు జనరేట్ చేయాల్సి ఉంది. ఈ అంశంలో జిల్లా రాష్ట్రంలో 26వ స్థానంలో ఉంది. జిల్లాలోని చాలా మండలాల్లో 50 శాతం, 40 శాతం ఐడీలు జనరేట్ చేశారు. కానీ అనంతపురం మండలంలో 54,030 ఐడీలు పెండింగ్ ఉన్నాయి. ఇక్కడ 31.62 శాతం మాత్రమే ఐడీలు జనరేట్ అయ్యాయి. డి.హీరేహాళ్ మండలంలో 6,083 మంది ఐడీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ 32.54 శాతం మాత్రమే పూర్తి అయింది. కుందుర్పిలో 4,682 మంది ఐడీలు పెండింగ్ ఉన్నాయి. 63.13 శాతం పని పూర్తి చేశారు. గార్లదిన్నె మండలంలో 4,638 మంది ఐడీలు పెండింగ్ ఉన్నాయి. 36.79 శాతం మంది ఐడీలు జనరేట్ అయ్యాయి. శెట్టూరు మండలంలో 3,705 మంది ఐడీల పెండింగ్ ఉన్నాయి. ఇక్కడ 38.47 శాతం పూర్తి చేశారు. గుంతకల్లులో 17,546 మంది ఐడీలు పెండింగ్ ఉన్నాయి. 39.83 శాతం పని పూర్తి చేశారు. పెద్దపప్పూరు మండలం 66.82 శాతం ఐడీలను జనరేట్ చేసి జిల్లాలో ముందంజలో ఉంది.

కలెక్టర్ దృష్టి సారించాలి..

జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులను అపార్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఆధార్ కార్డుల సవరణకు పల్లెల్లో ఎలాంటి సదుపాయం లేదు. దీంతో వందలాది మంది తల్లిదండ్రులు పట్టణాలలోని ఆధార్ కేంద్రాలకు, మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నాయి. ఒక్కసారిగా వందలాది మంది క్యూ కడుతుండటంతో నిర్వాహకులు సైతం ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని గ్రామ, వార్డు సచివాయాల్లో, పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

చదువుకోరా.. తమ్ముడూ..!

తమ్ముడు పదో తరగతి చదువుతున్నాడు. బడికి సరిగా వెళ్లడం లేదు. చిన్నోడు ఏమైపోతాడో అని తల్లిదండ్రులు బాధపడుతున్నారు. ఇంటర్ చదువుతున్న అన్నకు ఆవేదన కలిగింది. 'జులాయిగా తిరిగితే పాడైపోతావురా..! బాగా చదువుకో.. బడికి వెళ్లు.. అమ్మానాన్న నీ గురించి ఎంతగా బాధపడుతున్నారో చూడు..' అని చాలా చెప్పి చూశాడు. కానీ తమ్ముడిలో మార్పు రాలేదు. 'రేయ్.. నేను చస్తేనైనా నువ్వు మారుతావా..?' అని తీవ్ర ఆవేదన చెందాడు. అన్నంత పనీ చేసేందుకు రైలు కింద పడేందుకు వెళ్లాడు. సమయానికి పోలీసులు గమనించి.. అడ్డుకున్నారు. ఈ ఘటన గుత్తి పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీపీఐ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్. ఆయన భార్య కూలి పనులకు వెళుతుంటారు. వారికి ఇద్దరు కుమారులు. పెద్దోడు ఇంటర్, చిన్నోడు పదో తరగతి చదువున్నారు. తల్లిదండ్రుల దిగులంతా చిన్నోడి గురించే. తమ్ముడిలో మార్పు కోసం అన్న ఏకంగా ప్రాణాలు తీసుకోబోయాడు. ఇంటి నుంచి అర్ధరాత్రి బయటకు వచ్చి.. గుంతకల్లు రోడ్డులోని రైల్వే గేటు వైపు వెళుతుండగా నైట్‌బీట్ కానిస్టేబుల్ కిరణ్, హోంగార్డు శ్రీరాములు అనుమానించి, విచారించారు. విషయం తెలుసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి, అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. విద్యార్థి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

- గుత్తి, ఆంధ్రజ్యోతి

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు జేసీ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టరు

అనంతపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజలు అందించే ఫిర్యాదుల పరిష్కారంలో ఏ అధికారి కూడా నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వందల మంది తరలివచ్చారు. జేసీతో పాటు అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ మలోల, వివిధశాఖల ఉన్నతాధికా రులు ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 383 మంది అర్జీలు అందజేశారు. అనంతరం జేసీ అధికారులతో అర్జీల పరిష్కారంపై శాఖల వారిగా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

- **పింఛన్ల పంపిణీలో ప్రగతిపై సత్కారం**

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీలో ప్రగతి కనబరిచిన ఎంపీడీఓలను సత్కరించారు. డి.హీరేహాళ్, పామిడి, పుట్లూరు, కుందుర్పి, గుత్తి మండలాలకు చెందిన ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, ఆయా మండలాల పర్యవేక్షణ అధికారులను జేసీ సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

- **ఆస్పత్రులలో కనీస సౌకర్యాలు ఉండాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతులు కల్పించాలని వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులను జేసీ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆస్పత్రులలో పరిస్థితిపై సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరి యా ఆస్పత్రులలో కనీస మౌలిక వసతులు ఉండాలని అన్నారు. అంతర్గత రహదారులు, సివిల్ వర్కులు, తాగునీరు, కొళాయి కనెక్షన్లు, మరుగుదొడ్లు, సిటిజన్ చార్ట్, బయోమెడికల్ స్టోరేజీ పాయింట్, విద్యుత్, సూచిక బోర్డులు వంటివి తప్పనిసరిగా ఉండే లా చూడాలని ఆదేశించారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, వైద్యశాఖ క్వాలిటీ మేనేజరు స్టీఫెన్, ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

మీ కోసం కలెక్టర్ కాళ్లయినా పట్టుకుంటా

- మహిళలతో జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మహిళల అభ్యున్నతి కోసం కలెక్టర్‌కు నమస్కరించి, కాళ్లు అయినా పట్టుకుంటానని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన మహిళలతో మాట్లాడారు. మండలానికి గోకులం షెడ్లు వచ్చాయని, వాటిని తమకు ఇప్పించండి అని పలు గ్రామాల నుంచి మహిళలు వచ్చి ఆయనకు విన్నవించారు. దీంతో 'మీరు అభివృద్ధి చెందుతామంటే కలెక్టర్ కాళ్లు పట్టుకుని అయినా ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేయాలని కోరతా' అని ప్రభాకర్ రెడ్డి వారితో అన్నారు. పది ఎకరాల భూమి ఉన్న రైతులు కూడా తన వద్దకు వస్తున్నారని, తమ పిల్లలకు అల్ట్రాటెక్, అర్జాస్ ప్యాక్టరీల్లో ఉద్యోగం ఇప్పించాలని కోరడం బాధ అనిపిస్తోందని అన్నారు. ప్రస్తుతం పరిశ్రమల్లో రూ.10వేల నుంచి 15వేలు మాత్రమే ఇస్తున్నారని, కానీ పది ఎకరాల భూమి ఉండి పండించుకోలేక పిల్లలను తల్లిదండ్రులు ఎందుకు చిన్న జీతాలకు పంపుతున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా సరే కష్టపడి పనిచేసి ఆర్థికంగా ఎదగాలని ఆయన అన్నారు.

లా అండ్ ఆర్డర్ నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ నిర్వీర్యమైందని జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బహిరంగ లేఖ రాశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు లా అండ్ ఆర్డర్‌ను గాలికి వదిలేశారని, ఇది కేవలం రాజకీయం, ధనప్రభావం వల్లే జరిగిందని ఆరోపించారు. ఐఏఎస్, ఐపీఎస్, న్యాయాధికారులు, న్యాయవాదులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా న్యాయాన్ని కాపాడేవిధంగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు కొనుగోలుచేసే వారికి వాహన లైఫ్‌టాక్స్ కట్టించుకుంటే రోడ్డు ప్రమాదాల్లో తగిన భద్రత ఉంటుందని, కనీసం ఐదారేళ్లకు ఒకసారి అయినా రోడ్డుటాక్స్ కట్టించుకోవాలని హోంశాఖ, రవాణాశాఖ మంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు.



కమ్మూరు సర్వే నంబర్ 500లో వెంచర్

దారిని మింగినా పట్టించుకోరా..!

కూడేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కమ్మూరు దారిని ఆక్రమించి రియల్టర్లు వెంచర్ వేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారికి అనుకుని కమ్మూరు సర్వే నంబర్ 500, 503 నుంచి కమ్మూరు గ్రామానికి దారి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులో స్పష్టంగా ఉంది. ఈ దారిని రియల్టర్లు ఆక్రమించి వెంచర్లు వేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైనా అధికారులు పట్టించుకోపోవడం అనుమానాలకు తావిస్తోంది. అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న భూములు రూ.కోట్లు విలువ చేస్తున్నాయి. రైతుల నుంచి ఆ భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్నారు. ఈ క్రమంలో పూర్వం నుంచి ఉన్న రస్తాను కబ్జా చేశారు. ఆక్రమిత రస్తాను పరిశీలించామని, రియల్టర్లకు నోటీసులు ఇస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు మహబూబ్ బాషా అన్నారు.

రాక్రీట్‌కు ఉపాధి..!

- జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాక్రీట్ దోపిడీ
- 90 రోజుల ఉపాధి పథకం నిధులు స్వాహా
- నిర్మాణాలు చేయకనే సొమ్ము బదలాయింపు
- జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి
- గుట్టుగా వ్యవహారం చక్కబెట్టిన కొందరు అధికారులు

అనంతపురం సిటీ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ రూ.కోట్లను మింగేసింది. ప్రతి ఇంటికి ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పనిదినాలకు అందించే రూ. 30 వేలను కూడా డ్వామా ఏపీఓలు, హౌసింగ్ అధికారుల సహకారంతో గుట్టుగా కాజేసిందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం జరగకుండానే కొందరు అధికారులు రాక్రీట్ సంస్థకు బిల్లులు బదలాయించారనే ఆరోపణలు ఉన్నాయి. రాక్రీట్ సంస్థ దోపిడీలో తోపు సమీప బంధువైన ఓ ఏపీఓ కీలకంగా వ్యవహరించారని సమాచారం. జిల్లాలోని ఇతర ప్రాంతాలలో కూడా డ్వామా, హౌసింగ్ శాఖలకు చెందిన కొందరు అధికారులు ఆయా లబ్ధిదారులతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది.

● తోపు సమీప బంధువు ద్వారా అక్రమ వ్యవహారం

గతంలో వైసీపీ అధికారంలోకి రాగానే తోపు తమ సమీప బంధువైన ఓ ఏపీఓను తన నియోజకవర్గ పరిధిలోని మండలానికి తెచ్చుకున్నాడు. ఆ ఏపీఓ ద్వారా గుట్టుగా వ్యవహారం నడిపించి జగనన్న ఇళ్లకు సంబంధించి 90 రోజుల ఉపాధి పనిదినాల నగదును రాక్రీట్ సంస్థకు తరలించేలా ప్రణాళిక రచించి అమలు జరిపారు. విషయం తెలిసినా ఆశాఖ పీడీ కూడా ఏమీ చేయలేని స్థితిలోకి ఆ ఏపీఓ, తోపు నెట్టేశారనే చర్చ అప్పట్లో సాగింది. నిధులను లబ్ధిదారుడి అకౌంట్‌కు బదలాయించడం, వెంటనే రాక్రీట్ సంస్థకు అందించేలా అధికారుల ద్వారా కథ నడిపించారని అప్పట్లో జోరుగా వినిపించింది. ఇన్ని అక్రమ వ్యవహారాలు నడిపారనే ఆరోపణలున్న ఆ ఏపీఓ ఇప్పటికి అక్కడే పనిచేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ హయాంలో రాక్రీట్‌కు అక్రమంగా నిధుల బదలాయింపులో ఆ ఏపీఓ కీలకంగా వ్యవహరించినా కూటమి ప్రభుత్వం ఇప్పటికి కొనసాగిస్తుండటం పట్ల ఆశాఖ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో జగనన్న ఇళ్ల పరిస్థితి ఇలా...

- రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల సంఖ్య: 7671
- గత ఐదేళ్లలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య: 350
- వివిధ దశలలో ఆగిపోయిన ఇళ్ల సంఖ్య: 7321
- రాష్ట్ర వ్యాప్తంగా రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల సంఖ్య: 50,385
- గత ఐదేళ్లలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య: 1500 మాత్రమే (ఈ పనులకే రూ. 350 కోట్లు బిల్లులు రాక్రీట్‌కు తరలించారని సమాచారం.)
- జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల సంఖ్య: 72,457
- పూర్తయిన ఇళ్ల సంఖ్య: 28,021
- ఇప్పటికీ నిర్మాణానికి నోచుకుని ఇళ్ల సంఖ్య: 8161
- సుమారు 70 శాతం ఇళ్లకు 90 రోజుల కింద బిల్లులు చేసి రూ. కోట్లలో బిల్లులను స్వాహా చేశారనే సమాచారం.

● జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లోనే కాకుండా జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే తరహా అవినీతి, అక్రమాలు జరిగినట్లు సమాచారం. 90 రోజుల ఉపాధి సొమ్మును ఓ రకంగా రాక్రీట్ సంస్థ స్వాహా చేస్తే మిగతా ప్రాంతాల్లో డ్వామాలోని కొందరు ఏపీఓలు, హౌసింగ్‌లోని కొందరు అధికారులు కలిసి దోపిడీ చేశారు. లబ్ధిదారుడితో కుమ్మక్కై కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలను ఏమాత్రం పరిశీలించకుండానే 90 రోజుల పనిదినాల అమౌంట్‌ను డ్రా చేసి వాటాలుగా పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల కనీసం పునాదులు తీయకుండానే 90 రోజుల పనిదినాల అమౌంట్‌ను డ్రా చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడటం విమర్శలకు తావిస్తోంది. రాప్తాడు, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లో ఎక్కువగా అవినీతి అక్రమాలు జరిగినట్లు సమాచారం.



జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయం

● ఏపీఓలదే కీలకపాత్ర

ఉపాధి పథకం కింద 90 రోజుల పనిదినాల నిధుల బదలాయింపు జరిగే ప్రక్రియలో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏపీఓల పాత్ర ఎక్కువగా ఉంటుంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొందరు ఏపీఓలకు సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం, ప్రజా ప్రతినిధుల బంధువులకు అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ వేయడం, కొందరు టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఏపీఓలగా పోస్టింగ్ ఇవ్వడంతో ఎక్కడికక్కడ అవినీతి అక్రమాలు పెరిగిపోయాయి. హౌసింగ్ ఉద్యోగుల్లోను కొందరు వారితో కలిసి అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి.

మా దృష్టికి రాలేదు



ఉపాధి పథకంలో 90 రోజుల పనిదినాల కింద అవినీతి జరిగిందనే విషయం మా దృష్టికి రాలేదు. ఏపీఓల ద్వారా బిల్లులు మంజూరు చేస్తాం. మా పరంగా తప్పు జరిగి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సమగ్ర నివేదిక కూడా ఆయా ప్రాంతాల ఏపీఓల వద్ద ఉంటుంది.

-శైలజ, పీడీ, జిల్లా గృహ నిర్మాణశాఖ

నేరం చేయాలంటే భయపడాలి

- మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోండి
- కరడుగట్టిన నేరగాళ్ల కదలికలపై దృష్టి పెట్టండి
- ఉమ్మడి జిల్లా పోలీసులతో హోంశాఖ మంత్రి అనిత

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'మహిళలు, చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల కఠినంగా వ్యవహరించండి. వారు నేరం చేయాలంటే భయపడేలా పోలీసులు విధులు ఉండాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. అనంతపురం నగరంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది జరిగి నేరాలు, రోడ్డు ప్రమాదాలు, పోలీసుల చర్యలు, సేవల గురించి ఎస్పీలు జగదీష్, రత్న పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత నెలలో చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనపై పోలీసులు తీసుకున్న చర్యల గురించి హోం మంత్రి లోతుగా సమీక్షించారు. సమాజంలో యూనిఫామ్ ధరించే ఉద్యోగాలు చాలా ఉన్నా పోలీసు ఉద్యోగానికి ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. ఇందుకు అందరూ గర్వపడాలని అన్నారు. బాధ్యత కలిగిన శాఖలో ఉన్నామని, పోలీసులు ఉన్నారన్న నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా దైనందిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని అన్నారు. నక్సలిజాన్ని పూర్తిగా అణచిన చరిత్ర రాష్ట్ర పోలీస్ శాఖకు ఉందని అన్నారు. ఇలాంటి పోలీసులకు చిన్న చిన్న ఘటనలతో మచ్చ రాకూడదని అన్నారు. ముందస్తు చర్యలతో నేరాలను నియంత్రించాలని సూచించారు. కరడుగట్టిన నేరస్థులు, రౌడీషీటర్లు, చెడునడత కలిగిన వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విధుల్లో నిర్లిప్తత వద్దని అన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర వహించే సీసీ కెమెరాలను అవసరమైనన్ని అందజేస్తామని, టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నియంత్రణ పక్కాగా జరగాలని అన్నారు. మెరుగైన సేవలు అందించిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు.


సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులు



మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి అనిత

అలాంటి ఘటనలు జరగకూడదు..

చిలమత్తూరు గ్యాంగ్ రేప్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ ఐజీపీ శ్రీకాంత్ సూచించారు. పదే పదే నేరాలకు పాల్పడేవారిపై గట్టి నిఘా కొనసాగించాలని సూచించారు. తీవ్రమైన నేరాల్లో ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్, బేసిక్ పోలీసింగ్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయం, వినియోగించేవారి వరకు ఎవరినీ వదలకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, హోంశాఖ మంత్రి ఓఎస్డీ అనిల్ పులిపాటి, ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.


పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

నేడు డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మంగళవారం డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ జరగనుంది. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. హోం మంత్రి ఇప్పటికే అనంతపురం చేరుకున్నారు. అనంతపురం పీటీసీలో 2023 బ్యాచ్‌కు చెందిన 12 మంది డీఎస్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో ఏడుగురు మహిళా డీఎస్పీలు ఉండటం విశేషం. పాసింగ్ ఔట్ పరేడ్ మంగళవారం ఉదయం 9 గంటలకు మొదలౌతుంది.

అక్రమ డెప్యుటేషన్లపై ఆర్జేడీ విచారణ


విచారిస్తున్న కడప ప్రాంతీయ వైద్యాధికారి రామగిడ్డయ్య

అనంతపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అక్రమ డెప్యుటేషన్లపై అనేకమంది కొనసాగుతున్నారనే ఫిర్యాదులపై కడప ప్రాంతీయ వైద్యాధికారి(ఆర్జేడీ) రామగిడ్డయ్య విచారణ చేశారు. వైద్య శాఖ కమిషనర్ ఆదే శాల మేరకు ఆయన సోమవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి వచ్చారు. డీఎం హెచ్‌ఓ డాక్టర్ ఈబీ.దేవి, ఏఓ గిరిజా మనోహర్‌ల ద్వారా జిల్లా కార్యాలయంలో ఎంతమంది డెప్యుటేషన్లపై ఉన్నారు? ఎక్కడ పనిచేస్తున్నారు? ఇక్కడ ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు? ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చారు? రికార్డులలో ఏమని నమోదు చేశారు? వారిహాజరు ఎలా పరిగణించారు? తదితర వివరాలను తెలుసుకున్నారు. అక్రమంగా ఎవరిని డెప్యుటేషన్లు వేసుకోలేదని, కార్యక్రమాల నిర్వహణ సమయంలో కొంతమందిని తాత్కాలికంగా నియమించుకొని పనిచేయించుకుంటు న్నట్లు డీఎంహెచ్‌ఓ, ఏఓలు వివరించారు. అనంతరం ఎన్జీఓ నాయకులు విచారణాధికారిని కలిసి పని సర్దుబాటుకు మాత్రమే కొందరిని నియమించుకున్నారని అక్రమ డెప్యుటేషన్లు లేవని వినతి పత్రం అందజేశారు. కాగా తాత్కాలిక ఆర్డర్లు పొందినవారు ఇక్కడ పనిలేకపోయినా కొందరు ఆఫీస్‌లో ఉంటూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు ఉండేవి. విచారణాధికారి వస్తున్నారనే సమాచారంతో వాళ్లంత తమ ప్లేస్‌కు వెళ్లి పోవడం గమనార్హం. ఇక్కడ సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని విచారణాధికారి రామగిడ్డయ్య మీడియాకు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి

యాడికి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాల కట్ట గ్రామంలో ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి పడి యువకుడు మృతి చెందాడు. గ్రామంలో మల్లికార్జున, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు దేవరాజు(24) ఇంటివద్ద ఉంటూ సోదరులకు వ్యవసాయ ప నుల్లో సహాయం చేస్తుండేవాడు. ఆదివారం రాత్రి మిద్దెపైకి ఎక్కిన అతను కాలు జారి కరెంట్ తీగలపై పడ్డాడు. దీంతో షాక్‌కు గురై కిందపడి తీవ్రంగాగాయపడ్డాడు. గమనించినకు టుంబ సభ్యులు వెంటనే గుత్తి ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

తల్లిని వద్దన్న బిడ్డలపై కేసు

● సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద నమోదు ● సుమోటోగా స్వీకరించిన పోలీసులు

పత్తికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై తల్లిని కర్కశంగా వదిలేసిన బిడ్డలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా తల్లిని తీసుకెళ్లాలంటూ పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. రెండు పర్యాయాలు కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారిలో మార్పు రాలేదు. దీంతో గుంతకల్లులో ఉంటున్న కుమారుడు శ్రీనివాసులు, పత్తికొండ, బళ్లారిలో ఉంటున్న కుమార్తెలు శ్రీదేవి, సరస్వతిలపై సీనియర్ సిటిజన్స్ ప్రొటెక్షన్ యాక్ట్, సెక్షన్ 24 ప్రకారం సుమోటోగా కేసు నమోదు చేసినట్లు పత్తికొండ సీఐ జయన్న వెల్లడించారు. పత్తికొండ పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వెనుక కాలనీలో వృద్ధురాలు తిరుపతమ్మను కన్న కొడుకు శ్రీనివాసులు శనివారం రోడ్డుపై వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో కుమారుడు, కుమార్తెలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా వారు తల్లిని తమతో పాటు తీసుకెళ్లేందుకు నిరాకరించారు. అందుకే వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆర్డీవోకు సమాచారం ఇచ్చామన్నారు. కుమారుడు, కుమార్తెలను మంగళవారం ఆర్డీఓ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వృద్ధురాలు తిరుపతమ్మ కోలుకున్నాక అనాథ ఆశ్రమానికి తరలిస్తామని తెలిపారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధికి ప్రణాళిక

● డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికతో ముందుకు సాగాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య సూచించారు. డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. జీవనోపాధుల పెంపునకు ఓఎన్‌డీసీ కింద జిల్లాకు 1319 యూనిట్లు టార్గెట్ ఇచ్చారని, ఇప్పటి వరకు 400 యూనిట్లను గుర్తించామని తెలిపారు. మిగిలినవి నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు. ఉన్నతి కింద ఎస్టీ మహిళలకు 869 పెరటికోళ్ల పెంపకం యూనిట్లు కేటాయించారని, ఇప్పటి వరకు 763 యూనిట్లు గుర్తించామని తెలిపారు. రూ.6 వేల యూనిట్‌కు రూ.3,600 సబ్సిడీతో ట్రైకార్ నుంచి రూ.45.78 లక్షలు నిధులు కేటాయించారని తెలిపారు. ఉన్నతికింద ఎస్టీ మహిళలకు రూ.3 కోట్లు, ఎస్సీ మహిళలకు రూ.12 కోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్ శాతాన్ని పెంచాలని, అట్టడుగు సంఘాలను బలోపేతం చేయడానికి అన్ని విభాగాల్లో పురోగతి సాధించాలని సూచించారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఈశ్వరయ్య

వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి, డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీఏ-వెలుగు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షలో డీపీఎంలు గంగాధర్, రవీంద్రబాబు, ఏపీఎంలు అనిత, మద్దిలేటి, మంజుళ, స్త్రీనిధి మేనేజర్ హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత ఆర్ట్స్ కళాశాల

● ముగిసిన ఇంటర్ కాలేజ్ మహిళల క్రీడా పోటీలు

గుంతకల్లుటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజ్ మహిళల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విజేతగా, కేఎస్ఎన్ అనంతపురం కళాశాల రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో శ్రీశంకరానంద గిరిస్వామి కళాశాల విన్నర్‌గా, అనంతపురం శ్రీవాణి కళాశాల రన్నర్‌గా నిలిచాయి. టెబుల్‌టెన్నిస్‌లో కదిరి ఎస్‌టీఎస్ఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురం శ్రీవాణి కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో శ్రీశంకరానందగిరిస్వామి కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్కేయూ రన్నర్‌గా నిలిచాయి. చెస్‌లో అనంతపురంలోని ఎస్‌వీడీఎస్ విన్నర్‌గా, అనంతపురంలో కేఎస్ఎన్‌జీడీసీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీలో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని కేఎస్ఎన్‌జీడీసీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్కేయూ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వీరికి ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ బీ జెస్సీ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కళాశాల పీడీ మహబుబ్ బాషా, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ జెస్సీ

నీళ్లకు నిధులివ్వాలి

● బడ్జెట్‌లో రూ.ఏడువేల కోట్లు కేటాయించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.ఏడువేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులు పూర్తి చేయడానికి దాదాపు రూ.500కోట్లు అవసరమని నిపుణులు అంచనా వేశారన్నారు. ఈ నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. తుంగభద్ర డ్యాంకు కొత్తగేట్లు ఏర్పాటు చేయడానికి దాదాపు రూ.2100కోట్లు ఖర్చవుతుందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి కొత్తగేట్ల నిర్మాణానికి మన వాటా నిధులు ఇవ్వాలని కోరారు. హంద్రీనీవా పంట కాలువల నిర్మాణానికి రూ.1200కోట్లు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు రూ.2వేలకోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఉంతకల్లు జలాశయ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు.

ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-19 రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు ఆదిత్యరెడ్డి, హన్సీస్టీఫెన్, మిస్బా, విశ్వనాథ్, సాయితరుణ్, అనన్య, అభిగ్న, భువనకృతి, సాహోఅమ్రీన్‌లు ఈనెల 19 నుంచి కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. ఈ క్రీడాకారులను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, చెస్ కోచ్ హుస్సేన్‌ఖాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టర్

న్యూస్ బాక్స్

నాణ్యతలో రాజీ వద్దు

● క్యూసీ ఈఈ మల్లికార్జునమూర్తి


సమీక్షిస్తున్న ఈఈ మల్లికార్జునమూర్తి

అనంతపురం సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడవద్దని క్వాలిటీ కంట్రోల్ విభాగం (క్యూసీ) ఈఈ మల్లికార్జునమూర్తి స్పష్టం చేశారు. స్థానిక తన చాంబర్‌లో సోమవారం ఆయన అనంతపురం-1, 2, పెనుకొండ, కదిరి క్యూసీ విభాగాల డీఈఈలు, జేఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల వారిగా రికార్డులు, పనులు తదతర అంశాలపై ఆరా తీసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తమ విధుల్లో బాధ్యతగా పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్యూసీ రిపోర్టులు అందించేలా చూడాలన్నా రు. కార్యక్రమంలో డీఈఈలు రవీంద్ర, లోకన్న, నాగశేఖర్, విశ్వనాథరెడ్డి, పలువురు జేఈలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల కోసం ఓ యాప్


యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఆర్ఎం

గుంతకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం వచ్చేనెల నిర్వహించనున్న పోలింగ్‌లో రైల్వే ఉద్యోగుల ఓటు ఎక్కడుందో తెలిపే యాప్‌ను రైల్వే అధికారులు సోమవారం ఆవిష్కరించారు. రైల్వే డివిజన్‌లో పని చేస్తున్న రైల్వే ఉద్యోగులు తమ ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుసుకోవడానికి ఉపయోగపడే వేర్ ఈజ్ మై ఓట్ అనే యాప్‌ను ఈడీఆర్ఎం సుధాకర్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మిక సంఘ గుర్తింపు కోసం పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు వేర్ ఈజ్ మై ఓట్ యాప్‌లో తన పీఎఫ్ ఖాతా నంబరును నమోదుచేస్తే ఉద్యోగి పేరు, డిసిగ్నేషన్ వివరాలతో ఆ ఉద్యోగి ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుస్తుందని, ఆ వివరాలు చూపి ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, ఏపీఓ రంజిత్ కుమార్, సంపత్ పాల్గొన్నారు.

10న ఉచిత డీఎస్సీ కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అందించే ఉచిత డీ ఎస్సీ శిక్షణకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టును ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి పరీక్షకు హాజరుకావాలని కోరారు.

ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయం మార్పు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రఘువీరా కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయాన్ని మార్పు చేసినట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంప్యూటర్ సెంటర్, ఉర్దూ లైబ్రరీలను పాతూరులోని కేఎం సైపుల్లా కాంప్లెక్స్‌లోని 2వ ఫ్లోర్‌లోకి మార్చినట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

నేటి నుంచి ఎంపీడీఓలు, ఈఓఆర్డీలకు శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రెటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు నాలుగు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 5,6 తేదీల్లో ఉమ్మడి జిల్లా ఎంపీడీఓలకు, అనంతపురం జిలాల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు. 7,8 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని ఈఓఆర్డీలకు, శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ సెక్రెటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి: సీఎఫ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం సర్కిల్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోద బాయి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన ఆమె సర్కిల్ పరిధిలోని సిబ్బందితో సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకం కింద ఏఏ పనులు చేపడుతున్నారని సిబ్బందితో ఆరాతీశారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు.

న్యూస్‌బాక్స్


డీఎడ్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా డీఎడ్ పరీక్షలు

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎడ్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా సాగినట్లు విద్యాశాఖ ఏడీ-3 లాజర్ తెలిపారు. ఉదయం యువతులకు పరీక్ష నిర్వహించారు. 34 మందికిగాను ఒకరు గైర్హాజరయ్యారు. 33 మంది పరీక్ష రాశారన్నారు. మధ్యాహ్నం యువకులకు పరీక్ష నిర్వహించారు. 15 మందికిగాను 10 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరైనట్లు ఏడీ-3 తెలిపారు.

1.653 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.653 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ఇన్‌ఫ్లో 1042 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,059 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈనెల 18వతేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆ తరువాత అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 19 నుంచి 25వతేదీ మధ్య చెల్లిస్తే రూ.50, 26 నుంచి డిసెంబరు 3వ తేదీలోగా రూ.200, డిసెంబరు 4నుంచి 10వతేదీలోగా రూ.500 రుసుంతో కట్టాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. ప్రైవేటుగా రాసే విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30 తో అమ్ముడుపోయిన ట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.30 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30 వేలుతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.22 వేలుతో అమ్ముడు పోయాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 17 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అందజేశారు. వైద్యచికిత్స నిమిత్తం పట్టణానికి చెందిన శ్రావణికి రూ. 2.04 లక్షలు, ఎల్. ఉమా మహేశ్వర్‌కు రూ. 2 లక్షలు, ఎం లక్ష్మయ్యకు రూ. 20,524లు, జగన్నాథరెడ్డికి రూ. 2.96 లక్షలు, మహేంద్రకు రూ. 2లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే స్థానిక తన కార్యాలయంలో వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, వీరేశ్, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు గుత్తి విద్యార్థి

గుత్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే అథ్లెటిక్ పోటీలకు గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయికిరణ్ ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈనెల 2 అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14విభాగంలో సాయికిరణ్ ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈనెల 6నుంచి ఏలూరు జిల్లా ఉంగుటూరులో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు చెప్పారు. తర్వాత ఆ విద్యార్థిని అభినందించారు.


సాయికిరణ్‌తో ఉపాధ్యాయులు



శాంతినగర్, వివేకానంద క్వార్టర్స్‌లో దెబ్బతిన్న రహదారులు

అధ్వానం..!

రైల్వే పరిధిలో పాడైపోయిన రోడ్లు
డీఆర్ఎం కార్యాలయ రహదారి పరిస్థితీ అంతే..
తూతూ మంత్రంగా మరమ్మతులు


దెబ్బతిన్న డీఆర్ఎం ఆఫీసు అప్రోచ్ రోడ్డు

రైల్వే డివిజన్ కేంద్రం గుంతకల్లులో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. రైల్వే పరిధిలో ఉన్న దాదాపు అన్ని రోడ్లు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ రోడ్లను పలుమార్లు మరమ్మతు చేశారు. కాని పనులు చేసిన నెలల్లోనే అవి యథా స్థితికి చేరుతున్నాయి. ఆర్ఎస్ ప్రధాన రహదారిలో రెండు నెలల కిందట నిర్మించిన కొంత భాగం సిమెంటు రోడ్డు ధ్వంసమైపోయింది. ఆ రోడ్డును చూస్తే రైల్వే పనుల నాణ్యత ఎలా ఉందో ఊహించుకోవచ్చు. దక్షిణ మధ్య రైల్వే జీఎం ఎప్పుడు డివిజన్ కేంద్రం విజిట్‌కు వచ్చినా హుటాహుటిన లక్షలు పోసి మరమ్మతు పనులు చేస్తారు. అయితే అవి నెల రోజులు కూడా నిలవకపోవడం గమనార్హం.

- గుంతకల్లు, ఆంధ్రజ్యోతి

అన్ని రోడ్లూ అధ్వానమే

డివిజన్ కేంద్రంలోని డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే రహదారి, డీఆర్ఎం కార్యాలయంలోని రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, రైల్వే ఆసుపత్రి రోడ్డు, డీజిల్ షెడ్ రోడ్డు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ రోడ్డు, సెంట్రల్ స్కూల్, జీఆర్పీ కార్యాలయం రహదారి, శాంతినగర్ క్వార్టర్స్, వివేకానందనగర్ క్వార్టర్స్, డీఆర్ఎం కార్యాలయ అప్రోచ్ రోడ్డు, ఇలా దాదాపు అన్ని రోడ్లూ గుంతలమయమయ్యాయి. రైల్వే పరిధిలో ఉన్న 25 రోడ్లలో బాగున్నది ఒక్కటి కూడా కనిపించదు. ఎన్నికలకు ముందు దాదాపు రూ. 200 కోట్ల మేర నిధులు డివిజన్‌కు కేటాయించారు. కానీ డివిజన్ కేంద్రంలో ఒక్క రోడ్డును నిర్మించలేకపోయారు. పట్టణం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి తరచుగా దెబ్బతింటుండటంతో ఆటో డ్రైవర్లే మట్టిని తెచ్చి గుంతల్లో నింపి వాహనాలు వెళ్లడానికి అనువుగా మార్చుకున్న సందర్భాలున్నాయి. పట్టణంలో రోడ్లు బాగుండగా, రైల్వే పరిధిలోకి వస్తే ఒక్కసారిగా రోడ్ల రూపు మారిపోతుంది.

రెండు నెలల్లో ధ్వంసమైన రోడ్డు

రైల్వే పనులు ఎంత అధ్వానంగా ఉంటాయో తెలియాలంటే రైల్వే స్టేషన్ రోడ్డును చూస్తే అర్థమైపోతుంది. స్టేట్ బ్యాంకుకు ఎదురుగా ఆర్ఎస్ రోడ్డును ఎన్నిసార్లు మరమ్మతు చేసి ఉంటారో లెక్కలేదు. కానీ రిపేర్లు చేసిన నెలకే ఆ రహదారి యథాస్థితికి చేరుకుంటుంది. రోడ్డు దెబ్బతినడం, మరమ్మతు చేయడం, మరలా రోడ్డు గుంతల మయమైపోవడం, మరలా రిపేర్లు చేయడం ఇక్కడ నిత్యకృత్యం. దాదాపు రెండు నెలల కిందట రోడ్డు రిపేర్లలో భాగంగా 50 మీటర్ల మేర సిమెంటు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు కనీసం నెల రోజులు కూడా నిలవలేదు. ఇప్పుడు మరలా సిమెంటు లేచిపోయి, కంకర తొలగి గుంతలు ఏర్పడుతున్నాయి. రైల్వే ప్రాంతానికే అత్యంత ముఖ్యమైన కూడలిగా భావించే ఈ ప్రాంతంలో రోడ్డు అతుకుల బొంతను తలపిస్తూ ఉంటుంది. రైల్వే ఏరియాలో రోడ్లు సరిగా లేకపోవడం అనేది పక్కనపెడితే డీఆర్ఎం కార్యాలయం లోపల ఉన్న రోడ్ల పరిస్థితి వాటికి భిన్నంగా ఏమీ ఉండదు. జీఎం పర్యటన ఉన్నప్పుడల్లా లక్షలు వెచ్చించి రోడ్లు, డివైడర్లను రిపేరి చేస్తుండగా నెలలు కాదు కొన్ని వారాలలోపే ఆ మరమ్మతుల ఆనవాళ్లు కూడా కనిపించకుండా మరలా గుంతలు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డుతోపాటు రైల్వే కార్యాలయాలు, కాలనీల రహదారులను పునర్నిర్మించాలని రైల్వే కాలనీల ఉద్యోగులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి మాత

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు వేకువజామునే స్వామితో పాటు రాజరాజేశ్వరి అమ్మవారికి వివిధ అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయండి


అజయ్‌శర్మతో మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. బెంగళూరులోని నైరుతి రైల్వే నిర్మాణ విభాగ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అజయ్ శర్మను సోమవారం ఎమ్మెల్యే కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ.. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టిందన్నారు. రాయదుర్గం- తుంకూరు రైల్వే ట్రాక్‌పై రాయదుర్గం-అనంతపురం, రాయదుర్గం-కణేకల్లు మార్గాల మీద రెండు ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారన్నారు. కాగా రైల్వేశాఖ వీటిని సగం నిర్మించి వదిలేసిందని తెలిపారు. సగం పనులు పూర్తయి దిష్టిబొమ్మల్లా ఉన్న రెండు బ్రిడ్జిలను వెంటనే పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరారు. దీనిపై చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సానుకూలంగా స్పందించారని కాలవ తెలిపారు.

'మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి'

గుంతకల్లుటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు కోరారు. విద్యార్థులతో కలిసి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన పథకాన్ని తొలగించిందన్నారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిందని, సీఎం చంద్రబాబు చొరవ చూపి మళ్లీ ఆ పథకాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు రమాదేవికి వినతి పత్రాన్ని అందజేశారు.

జిల్లాను అభివృద్ధి బాట పట్టిద్దాం..

- పరిశ్రమల ఏర్పాటుకు పుష్కల అవకాశాలు
- సమష్టిగా పనిచేద్దాం
- అధికారులు మారాలి.. పనిచేయాలి..
- భూముల ఫ్రీహోల్డ్‌లో భారీగా అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తప్పవ్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్



ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీ

పుట్టపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి అయిన అనగాని సత్యప్రసాద్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. మొదట కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయం, పాడిపంటలపై వివరించారు. ఇన్‌చార్జి మంత్రి అనగాని మాట్లాడుతూ.. జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు భూములు పుష్కలంగా ఉన్నాయన్నారు. పరిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో భూముల ఫ్రీహోల్డ్ ప్రక్రియలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల ఎకరాల భూములను ఫ్రీహోల్డ్ చేయగా.. జిల్లాలోనే 2.3 లక్షల ఎకరాలు చేశారన్నారు. ఇందులో 1.15 లక్షల ఎకరాలు నిబంధనలు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారని మంత్రి వెల్లడించారు. దీనిపై కమిటీ వేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు గత ప్రభుత్వం తరహాలోనే పనిచేస్తున్నట్లున్నారనీ, అలా కుదరదని మంత్రి స్పష్టం చేశారు. పనితీరు మారాలనీ, వేగం పెంచాలన్నారు. జిల్లా మార్పు అంశం ఎక్కడా ప్రస్తావనకు రాలేదన్నారు. పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోజుకో మంచి పనిచేసేలా పథకాలు



సంక్షేమం, అభివృద్ధి రెండు విభాగాల్లో సమంగా అభివృద్ధి చేయాలి. 150 రోజుల్లో రోజుకో మంచిపని చేసేలా పథకాలు అమలు చేశాం. జిల్లాలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం.

- సత్యకుమార్ యాదవ్, వైద్యశాఖ మంత్రి

ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయండి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు డబ్బు చెల్లించి, నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు అందలేదు. వారికి వెంటనే అందేలా చూడాలి. వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



నియోజయకవర్గంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే మొదలు పెట్టాలి. చెన్నేకొత్తపల్లి, నాగసముద్రం, పులేటిపల్లి వద్ద రైతులకు చెందిన 4 వేల ఎకరాల బీడు భూములు ఉన్నాయి. వాటిలో సోలార్ హబ్, హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలి. దాదలూరు పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పాలి. పేరూరు కాలువలకు భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం పరిహారం అందజేయాలి.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



2014 నుంచి 2019 వరకు ఆయాశాఖల్లో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు గత ప్రభుత్వం చెల్లించలేదు. వాటిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- బీకే పార్థసారథి, ఎంపీ

కరువు మండలాలుగా ప్రకటించాలి



నియోజకవర్గంలో ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి. నియోజకవర్గంలోని 195 చెరువులకు కృష్ణాజలాలను మళ్లించేందుకు చొరవ చూపాలి. సత్యసాయిబాబా జయంతి వేడుకలకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలి.

- పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

వరద బాధితులకు పింఛన్‌దారుల సాయం


పరిటాల శ్రీరామ్‌కు చెక్కు అందజేస్తున్న పింఛన్‌దారులు

ధర్మవరం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లికి చెందిన పింఛన్‌దారులు.. విజయవాడ వరద బాధితులకు రూ.1.15లక్షల సాయం చేశారు. ఆ మొత్తాన్ని సీఎం సహాయనిధికి ఇచ్చారు. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజయవాడ ప్రజల కోసం తమవంతుగా సాయం చేశామన్నారు. పింఛన్‌దారులకు పరిటాల శ్రీరామ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చేయి తడిపితేనే సంతకం పెడతా

చిరుద్యోగులపై హెచ్ఎం ప్రతాపం
వేతనాలు అందకుండా వేధింపులు

హిందూపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చేయి తడిపితేనే వేతనాల బిల్లులపై సంతకం చేస్తానంటూ ఓ ప్రధానోపాధ్యాయురాలు.. చిరుద్యోగులపై ప్రతాపం చూపారు. వేతనాలు అందకుండా వేధించారు. దీనిపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాల వాచ్‌మన్‌గా నజీర్, ఆయాగా అతడి భార్య షాహీనాను నియమించారు. వారికి ప్రతినెలా వేతనం డబ్బు ఖాతాలకు జమవుతుంది. మూడు నెలలుగా వేతనాల బిల్లులపై ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం సంతకం పెట్టట్లేదు. అడిగినా పట్టించుకోవడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన చెందుతున్నారు. రూ.2వేలు ఇస్తేనే సంతకం చేస్తానని తెగేసి చెబుతున్నారని వాపోయారు.

తిండికి లేక పస్తులుంటున్నాం

- షాహీనా, ఆయా

నిరుపేదలం. వేతనం అందక తిండికి కూడా లేక పస్తులుంటున్నాం. మూడు నెలలుగా జీతం బిల్లులపై సంతకం చేయకపోవడంతో అవి ముందుకు కదలలేదు. హెచ్ఎంను వేడుకుంటున్నాం. అయినా కనికరించడంలేదు. పాఠశాల హాల్‌లోకి కూడా రావద్దని హుకుం జారీ చేశారు.

దురుసుగా మాట్లాడుతోంది

ఆయా షాహీనా దురుసుగా మాట్లాడుతోంది. హెచ్ఎం అనే మర్యాద కూడా ఇవ్వట్లేదు. అయినా గత నెలలో వేతనాల బిల్లులు ఆమెకు తెలియకుండా ఆన్‌లైన్ చేశా. పేపర్లతో పనిలేదు. ఈనెల బిల్లులు మాత్రమే పెట్టాలి. ఆ సంతకం కూడా మంగళవారం పాఠశాల వద్దకు వస్తే పెట్టి పంపుతానని చెప్పా.

- సామ్రాజ్యం, హెచ్ఎం

బాలికకు వేధింపులు.. పోక్సో కేసు నమోదు

పెనుకొండ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలికపై వేధింపులకు పాల్పడిన ఎరుకల విజయ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు కియ స్టేషన్ ఎస్ఐ రాజేష్ సోమవారం తెలిపారు. ఎరుకల విజయ్.. బాలిక వెంట పడుతూ, ఫొటోలు తీస్తూ వేధిస్తుండేవాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కదిరి బాలికలు.. మనుబోలులో ప్రత్యక్షం

బాలసదన్‌కు తరలించిన అధికారులు

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై అలిగి వచ్చేసిన ఇద్దరు బాలికలకు నెల్లూరు జిల్లా మనుబోలు తిరుగుతుండగా ఆదివారం రాత్రి స్థానికులు గుర్తించారు. ఆరిని ఎస్ఐ రాకేష్ నెల్లూరులోని బాలసదన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో తల్లిదండ్రుల వేధింపులు తాళలేక, వారి ఆలనాపాలనా లేకపోవడంతో ఇంట్లో నుంచి శుక్రవారం పారిపోయి వచ్చేశారు. గూడూరు వెళుతున్న రైలు ఎక్కి మనుబోలు వద్ద దిగారు. రాత్రి పది గంటల సమయంలో మనుబోలులో దసరా చావడి వద్ద తిరుగుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ స్పందించి బాలికల నుంచి సమాచారం సేకరించారు. రోదిస్తున్న వారికి భోజనం పెట్టించి నెల్లూరులోని బాలసదన్‌కు తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు రాగానే బాలికలను అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్తం

ఉద్యోగాలకు ఎంపిక

నార్పల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు రెండు కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 40 మంది అభ్యర్థులు హాజరుకాగా 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. డేవిడ్ తెలిపారు.

శాశ్వత సభ్యత్వం స్వీకరణ


శివకృష్ణ చౌదరి

నార్పల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గంలో టీడీపీ మొట్టమొదటి శాశ్వత సభ్యత్వాన్ని నార్పల మండలం బొందలవాడకి చెందిన మెల్లంపూటి శివకృష్ణ చౌదరి తీసుకున్నారు. ఆయన సోమవారం టీడీపీ శాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష చెల్లించారు. 20 సంవత్సరాలుగా వివిధ స్థాయిల్లో పార్టీకి తన సేవలు అందిస్తున్న శివకృష్ణ చౌదరిని పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నార్పల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కూరగానిపల్లిలో ఉన్న చెన్నకేశవ అనాధాశ్రమంలో మానసి దివ్యాంగులు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. చలికాలం దృష్టిలో ఉంచుకుని దుప్పట్లతో పాటు మంకీ క్యాప్‌లు, రూ. వేయి నగదు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'స్థలాలు ఇప్పించండి'

చెన్నేకొత్తపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వం మాకిచ్చిన ఇంటిస్థలా లను తమకు దక్కకుండా కొందరు అడ్డుకుం టున్నారని, మీరే న్యాయం చేయాలంటూ మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన పలువురు సోమవారం తహసీల్దార్‌ను కలిసి విన్నవించారు. 25ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వంలో స్థానికంగా 20 మంది వరకు ఇంటిస్థలాలు కేటాయించారని గ్రామానికి చెందిన సరస్వతమ్మ, రామాంజినమ్మ, ఆదెమ్మ, లక్ష్మమ్మ, రామక్క, రాయమ్మ, నరసమ్మ, తిరుమలక్క, అంజినమ్మ, నాగమ్మ తహసీల్దార్ సురేశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో ఆర్థిక స్థోమత లేకపో వడంతో ఇల్లు కట్టుకోవడంలో ఆలస్యమైం దని, ఇప్పుడు ఇళ్లు కట్టుకుందామను కుంటే అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ


ఆర్డీఓ కేశవ నాయుడు

అనంతపురం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీఓగా కేశవనా యుడు సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. గతంలో ఆర్డీఓగా ఉన్న వెంకటేశులు బదిలీ అనంతరం డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. పిఠాపురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కేశవనాయుడును ఇక్కడకు బదిలీ చేశారు. నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన కేశవనాయుడుకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

వైసీపీ నాయకుడిపై ఫిర్యాదు

కనగానపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం మీది ఉందని నా పొలానికే అడ్డువేస్తారా.. నా గవర్నమెంట్ వస్తే నరుకుతా' అంటూ ఓ వైసీపీ నాయకుడు హెచ్చరించారని పోలీసులకు సోమవారం సాయంత్రం బాధితులు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని బద్దలాపురం గ్రామంలో లక్ష్మీనరసమ్మ అనే దళితురాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బద్దలాపురానికే చెందిన దినేష్‌రెడ్డి, అతడి బంధువులు ఆదివారం రాత్రి తన ఇంట్లో ఎవరూ లేనిసమయంలో తనపై దాడి చేసి గాయపరిచారన్నారు. కులం పేరుతో దూషించా రరని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపడు తున్నామని ఎస్‌ఐ ఇషాక్‌బాషా తెలిపారు.

పేకాడుతున్నవారి అరెస్ట్

అనంతపురం క్రైం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలో పేకాడుతున్న 11 మందిని నాలుగోపట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1,36,930 స్వాధీనం చేసుకున్నారు. కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నగరానికి చెందిన కొందరు సోమవారం పేకాడుతుండగా నాలుగో పట్టణ సీఐ సాయినాథ్‌కు సమాచారం అందింది. ఎస్‌ఐ రాంప్రసాద్ సిబ్బందితో వెళ్లి వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

జిల్లా రైతులను ఆదుకోవాలి

శింగనమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనంత కరువు రైతులను ఆదుకునేందుకు, తక్షణమే అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ మండల కన్వీనర్ చిన్నప్పయాదవ్ అధ్యర్యంలో ధర్నా నిర్వహించి, తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు.


అలంకరణలో మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరుడు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తజనం


శివబాలయోగి ఆశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాహిమాం... పరమేశ్వరా..!

- ఘనంగా కార్తీక దీపోత్సవాలు
- కిటకిటలాడిన ముక్కంటి ఆలయాలు

అనంతపురం కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం ఆధ్యాత్మికశోభతో అనంత అలరారింది. శైవక్షేత్రాలన్నీ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించారు. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా కార్తీక దీపకాంతులతో దేదీప్యమానంగా వెలిగింది. ముక్కంటికి ప్రీతికరమైన కార్తీకమాస పూజలతో జిల్లాకేంద్రంలోని పలు ఆలయాలు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి. పరమశివుడికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, గణపతిహోమాలతో శివాలయాలన్నీ భక్తిపారవశ్యానికి వేదికలుగా మారాయి. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం భక్తులతో పోటెత్తింది. కాశీవిశ్వేశ్వర స్వామికి రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వందలాదిమంది మహిళలు ఆలయ ఆవరణలో కార్తీకదీపాలు వెలిగించారు. హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామికి బిల్వార్చన, రుద్రాభి షేకం చేశారు. పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం, ఉమానగర్‌లోని దత్తాత్రేయ ఆలయం, హెచ్చెల్సీ కాలనీ చాముండేశ్వరి ఆలయం, ఆర్ రోడ్డు శివాలయం, నగరశివారులోని శివకోటి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, జడ్పీ ఎదురుగా ఉన్న గీతామందిరం, అరవిందనగర్ సర్వేశ్వరాలయం, చెరువుకట్ట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరాలయం పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న ముక్కంటి ఆలయాలన్నీ కార్తీకశోభతో నందడిగా మారాయి.

గుంతల రోడ్లు చూసి భయపడేవారు

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- రుద్రంపేటలో రోడ్ల మరమ్మతుల పరిశీలన


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గుంతల రోడ్లు చూసి ఏపీకి రావాలంటేనే ప్రజలు భయపడేవారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీ నుంచి తగరకుంట వెళ్లే మార్గంలో గుంతలు పడ్డ రోడ్లకు 'మిషన్ పాత్ హోల్స్ ఫ్రీ' కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు చేపట్టారు. ఆ పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం పరిశీలించారు. రోడ్లు ఎంత మేర దెబ్బతిన్నాయి? పనులు ఎలా జరుగుతున్నాయి? అనే విషయాలపై ఆరాతీశారు. మరమ్మతుల పనులు నాణ్యంగా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో ఈ రోడ్డులో వెళ్లాలంటే గుంతలను చూసి వాహనదారులు జంకే వారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా తయారైన రహదారులు చాలా ఉన్నాయన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.860 కోట్లతో మిషన్ పాత్ హోల్స్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రస్తుతం రోడ్లకు మరమ్మతులు చేస్తుండటంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. గత ప్రభుత్వంలాగా ప్రజల సమస్యల్ని గాలికొదిలేయలేదని... సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించ డంలో ముందున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారి కాటమయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు గంగారామ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ హరి, టీడీపీ నాయకులు భక్తవత్సలం నాయుడు, ఎస్ఎం భాష, ఖాసీం, వెంకటరాముడు, బాలప్ప, కరుణాకర్, కొండయ్య, సుధాకర్, ఆది పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

అనంతపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అర్బన్ పరిధిలోని ఏడుగురు బాధితులకు రూ.8.71 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అందజేశారు. నగరంలోని టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో సోమవారం బాధితులకు ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు కూచి హరి, వెంకటప్ప, మల్లెల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎరువుల డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చింతా వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, క్రిమిసంహారక మందుల డీలర్ల సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. డీలర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సాయం చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూచి హరి, కేవీ శేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

2.5 టన్నుల ఐరన్ మాయంపై ఫిర్యాదు

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటి నిర్మాణానికి ఉంచుకున్న రెండున్నర టన్నుల ఐరన్‌ను దొంగలెత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నీరుగంటి వీధికి చెందిన వెంకటక్రిష్ణ ఇంటి నిర్మాణానికి కొన్ని రోజుల క్రితం ఐరన్ తెచ్చి పెట్టుకున్నారు. ఈనెల 2వతేదీ రెండున్నర టన్నుల ఐరన్‌ను ఎవరో ఎత్తుకెళ్లారు. వెతికినా కనిపించకపోవడంతో సోమవారం వెంకటక్రిష్ణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మేయర్ చాంబర్ ఎదుట కార్మికుల నిరసన

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు మేయర్ ఛాంబర్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, నాగభూషణం ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలిపారు. మేయర్ స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్‌కు సూచించారు.

సంస్కృత భాష కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంస్కృత భాష కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తెలిపారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో వారంలో మూడు రోజులు గంట చొప్పు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న 15 సంవత్సరాల వయసుపైబడిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9756076965 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేయాలి

అనంతపురం సెంట్రల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేసి త్వరతగతిన విచారణ పూర్తిచేయాలని సోమవారం ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బాధితులపైనే కౌంటర్ కేసులు బనాయించి అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చారని మండిపడ్డారు.

పరిష్కారాలకు మూలసూత్రం గణితశాస్త్రం

అనంతపురం సెంట్రల్, నవబంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణాంకాలు, కంప్యూటర్ కోడింగ్ వంటి పరిష్కారాలకు గణితశాస్త్రం మూలసూత్రమని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సత్యలత హాజరై మాట్లాడారు.

భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత


మాట్లాడుతున్న అనంత

అనంతపురం క్రైం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాన్ని అణగదొక్కాలని చూస్తే, అంతే బలంగా పైకి లేస్తామనే ఉద్దేశ్యంతో... కూటమి ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే వైసీపీ శ్రేణులు, సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో తాత్కాలిక భవనాల కోసం చదరపు అడుగుకు ఏకంగా రూ.15వేలు ఖర్చు చేశారని, ఇది నిజం కాదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సుధాకర్‌బాబు సవాల్ విసిరారు. అమరావతి కోసం కేంద్రం 2014 నుంచి 2019వరకు ఇచ్చిన నిధులు ఏమయ్యాయన్నారు కార్యక్రమంలో నాయకులు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిని తగ్గించడంలో ఫిజియోథెరపీ కీలకం: ఎంపీ


యామినికి పట్టాను ప్రదానం చేస్తున్న ఎంపీ

అనంతపురం సెంట్రల్, నవబంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యాధుల బారినుంచి పూర్తి స్థాయిలో కోలుకోవాలంటే ఫిజియో థెరపీ కీలకమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ అధ్యక్షతన నిర్వహించిన పట్టాల ప్రదానోత్సవానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కర్నూలు బెటాలియన్ ఐపీఎస్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల ఫిజియో థెరపీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు సొంతంగా థెరపీ క్లినిక్‌లను నిర్వహించి స్వయం ఉపాధి పొందవచ్చున్నారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం కోర్స్ పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్థో విభాగాధిపతి ప్రొఫెసర్ ఆత్మారావు, మెడికల్ కళాశాల పెథాలజిస్ట్ డాక్టర్ చైతన్య, కళాశాల సెక్రెటరీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు గంజాయి విక్రయం పై ప్రత్యేక దృష్టి సారించారు. గత వారం రోజుల వ్యవధిలో గంజాయి రవాణా చేసే, విక్రయించేవారిని 15మందిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఎర్రనేల కొట్టాలలో జరిగిన గంగమ్మ హత్య కేసులో నిందితుడు ప్రకాష్ గంజాయి వినియోగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో మరికొంతమందిని ప్రత్యేకంగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

హోం మంత్రికి ఘన స్వాగతం


హోంమంత్రికి స్వాగతం పలుకుతున్న బంగి నాగ

అనంతపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం సాయంత్రం జిల్లాకు వచ్చిన మంత్రికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తోపాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, కమ్మ సంఘం నాయకులు సరిపూటి సూర్యనారాయణ, బాంబే డయింగ్ నాగన్న, పలువురు టీడీపీ నాయకులు రాయల్ మురళి, కూచి హరి తదితరులు ఘన స్వాగతం పలికారు. సప్తగిరి సర్కిల్ సమీపంలోని ఓ హోటల్‌లో వారు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వైకుంఠం ప్రభాకర్‌చౌదరి నివాసంలో సోమవారం రాత్రి పలువురు నాయకులతో కలిసి హోం శాఖ మంత్రి అనిత అల్పాహార విందు చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తదితరులున్నారు. అంతకుముందు తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, తెలుగు మహిళలు హోం మంత్రికి హారతితో స్వాగతం పలికారు.




మంత్రికి స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు స్వప్న, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవాని

జనన ధ్రువపత్రాలు ఎప్పుడిస్తారు..?

- తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రుల వాగ్వాదం


జనన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు

శింగనమల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మా పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు ఎప్పుడిస్తారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థులకు వన్ ఇండియా- వన్ అపార్ ఐడీ కోసం వారి తల్లిదండ్రుల అవస్థలు చెప్పనలవి కాదు. జనన ధ్రువీకరణ లేదా ఆధార్ కార్డు లేదా యూ-డైస్‌లో ఎక్కడ చిన్న అక్షరం తేడా ఉన్న అపార్ కార్డు జనరేట్ కాకాపోవడంతో తప్పని సరిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు, అధికారులు తెలుపుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు తీసుస్తున్నారు. అయితే దరఖాస్తు చేసుకుని వారాలు గడుస్తున్నా అధికారులు జాప్యం చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థి జనన ధ్రువీకరణ కార్యాలయంలోని రిజిస్టర్‌లో లేకపోతే అధికారులు ఫారం-10 జారీ చేయడానికి 10 రోజులుపైగా పడుతోంది. ఫారం-10 తీసుకుని ఆ విద్యార్థి పేర మీద నోటరీ తీసుకోవడానికి, తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి తదితరాలకు సమయం ఎక్కువగా కావడమే కాకుండ, అదనంగా మరో రూ. వేయికి పైగా ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన చిన్నజలాలపురానికి చెందిన బోయ నరేంద్ర, పెరవలికి చెందిన కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ... తమ పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల కోసం దాదాపు 20 రోజుల కిందటే దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పటి వరకు అందలేదన్నారు. నా పుట్టిన తేది తప్పుగా ఉందని వెంటనే జనన ధ్రువీకరణ పత్రం తీసుకు రమ్మని మా టీచర్ తెలిపారని రాచేపల్లికి చెందిన రత్నదీప్ అనే విద్యార్థి తెలిపాడు. ఇక్కడ పనికావడంలేదని వాపోయాడు. ఎన్నిరోజులకు ఇస్తారోనని అంటున్నారు.

ఎప్పటికప్పుడు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం

జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న రిజిస్టర్ నమోదైన వాటికి వెంటనే ఇస్తున్నాం. రిజిస్టర్‌లో లేని వాటి కోసం ఫారం-10 ఇస్తున్నాం. దరఖాస్తులు ఎక్కువగా రావడంతో కొద్దిగా అలస్యం అవుతోంది. రెండు రోజుల్లోగా దరఖాస్తు చేసుకున్న అందరికీ పత్రాలు జారీ చేస్తాం.

- సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్

ఏపీ టెట్‌లో 'సాయిగంగ' అభ్యర్థుల ప్రభంజనం

- ముగ్గురు అభ్యర్థులకు 150కి 150 మార్కులు


మంజుల


అనూష


లావణ్య


రాశి

అనంతపురం విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ టెట్ ఫలితాల్లో సాయి గంగ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు సత్తా చాటారని మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల జగదీష్ పేర్కొన్నారు. సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారిని ఆయన అభినందించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ...తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన పలువురు అభ్యర్థులు 150కి 150 మార్కులు సాధించినట్లు స్పష్టం చేశారు. అభ్యర్థులు మంజుల (హాల్‌టికెట్ నెం: 7240439153), అనూష (7240142005), లావణ్య (7240310100) వందకు వంద శాతం మార్కులు సాధించారన్నారు. అదే విధంగా మరో అభ్యర్థి రాశి (హాల్‌టికెట్ నెం : 7240422324) 150 మార్కులకు149.56 మార్కు లు సాధించిందని తెలిపారు. వీరిలో మంజుల 2022లో జరిగిన టెట్‌లో సైతం 150 మార్కులకు 150 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఇలా టెట్‌లో ఒకే అభ్యర్థి 2 సార్లు 150కి 150 మార్కులు సాధించడం అనంతపురం జిల్లాకే గర్వకారణం అన్నారు. 2024 ఏపీ టెట్ ఫలితాల్లో ముగ్గురు అభ్యర్థులు రాష్ట్ర స్థాయిలో ప్రభంజనం సృష్టించడం ఆనందంగా ఉందన్నారు.

రెండోరోజు కొనసాగిన క్రికెట్ పోటీలు


భాను శ్రీ హర్ష


ప్రకాష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండో రోజు క్రికెట్ పోటీలు కొనసాగాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అండర్-16 రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీలు సోమవారం రెండో రోజు కొనసాగాయి. ఏసీఏ-ఎ జట్టు, ఏసీఏ-బి జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన టీం ఏ జట్టు 77ఓవర్లలో 266పరుగులకు ఆలౌట్ అయింది. బి జట్టు బౌలర్ మహిత్ 5వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన ఏసీఏ -బి జట్టు 68.3ఓవర్లలో 215పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో భాను శ్రీహర్ష 90పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి టీం ఏ జట్టు 30 ఓవర్లలో 5వికెట్లకు 107పరుగులు చేసింది. టీం ఏ బౌలర్ ప్రకాష్ 5వికెట్లు తీశాడు. టీం ఏ 158పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో ఏసీఏ-సి, ఏసీఏ-డి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన డి జట్టు 77ఓవర్లలో 346పరుగులకు ఆలౌట్ అయింది. దేవ్ ప్రమోద్ 217బంతుల్లో 39బౌండరీలతో 215పరు గులు చేశాడు. ఓవర్‌నైట్ స్కోర్ 11ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 29పరుగులతో ప్రారంభించి 52.2ఓవర్లలో 139పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీం డి జట్టు 48ఓవర్లలో 5వికెట్ల కు 205పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ బాదిన దేవ్ ప్రమోద్ మరోసారి సెంచరీ (112) బాదాడు.దీంతో టీం డి జట్టు 412పరు గుల ఆధిక్యంలో నిలిచింది.

రాష్ట్రస్థాయి పోటీలకు ముట్టాల విద్యార్థిని


ఎంపికైన విద్యార్థిని శ్రీజ

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముట్టాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీజ స్కూల్ గేమ్స్ అండర్ - 14 జిల్లా స్థాయి డిస్కస్ త్రో విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. విద్యార్థిని బుధవారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని శ్రీజను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

రాప్తాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొళ్లపల్లి సమీపంలో ఉప్పనేసినపల్లికి వెళ్లే దారిలో సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో చాపట్ల గ్రామానికి చెందిన యువకుడు రాజు (19) మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. చాపట్లకు చెందిన రాజు కూలి పని, అప్పుడప్పుడు ఆటోకు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పలు గ్రామాల నుంచి సేకరించిన పాల క్యాన్లలను ఆటోలో ఎస్ఎస్ గేటులోని డెయిరీకి తరలించేవారు. సోమవారం ఆటో డ్రైవర్‌గా రాజు, తోడుగా స్నేహితుడు ప్రసాద్ వెళ్లాడు. రోజూలాగే సోమవారం రాత్రి చిగిచెర్ల, ఉప్పనేసినపల్లి పాల క్యాన్లతో ఆటో గొళ్లపల్లికి వస్తుండగా... గొళ్లపల్లి నుంచి ఉప్పనేసినపల్లి వైపు వెళుతున్న బొలేరో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రసాద్ తీవ్రంగా గాయపడటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు రాజుకు వివాహం కాలేదు. రాజు శివమాల ధరించి ఉన్నాడు. రాప్తాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పామిడిలో ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరస్వామి


ఉరవకొండలో గవిసిద్ధేశ్వరుడికి పూజలు


గుంతకల్లులో విరూపాక్షేశ్వరుడికి అన్నాభిషేకం


పెద్దపప్పూరు మండలంలో ప్రత్యేక అలంకరణలో అశ్వత్థ నారాయణుడు

ఆలయాలకు కార్తీక శోభ

- శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్‌: కార్తీకమాస మొదటి సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని శివాలయాల్లో పూజలు జరిగాయి. వేకువజామునే అర్చకులు ఆలయాల్లోని మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీప కాంతులతో ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. పలు వైష్ణవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

టీడీపీ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్‌, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరి క్రాస్‌లో సోమవారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. గ్రామంలో సుమారు 150మందితో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో నాయకులు మల్లీడు శ్రీనివాసులు, నర్సరీ శీనా, మల్లేష్‌, వన్నూరుస్వామి, రంగస్వామి తదతరులు పాల్గొన్నారు.

గుంతకల్లు టౌన్‌: పట్టణంలోని 8వ వార్డులో ఆ వార్డు టీడీపీ ఇన్చార్జి కోడి శీనా, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్‌ పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. నాయకులు మోహన్‌, రామప్ప, రామాంజి, నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా

విడపనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏగా పనిచేయకున్నా.. ఉద్యోగోన్నతి పొందిన లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల వీఆర్‌ఏలు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ లోకేష్‌ విడపనకల్లు గ్రామంలో వీఆర్‌ఏగా ఒక్కరోజు కూడా పని చేయలేదన్నారు. అలాంటి వ్యక్తికి పదోన్నతి ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించటం ఏమిటని ప్రశ్నించారు. సీనియర్‌ వీఆర్‌ఏలు ఉన్నా.. లోకేష్‌కు పదోన్నతి ఎలా ఇస్తారని నిలదీశారు. లోకేష్‌ తండ్రి డీఆర్‌ఓ కార్యాలయంలో ఉద్యోగిగా ఉండటంతో జిల్లా అధికారులు కొంత మంది లోకేష్‌కు వత్తాసు పలికి సీనియర్‌ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారు మండిపడ్డారు. లోకేష్‌ను వెంటనే విధుల నుంచి తొలగించి. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఈ మేరకు డీటీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. తన ఉద్యోగానికి ఏదైనా జరిగితే అంతు చూస్తానని లోకేష్‌ బెదిరించాడని, అందుకు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు చెప్పారు.



రోడ్డు ప్రమాదంలో గాయాలు

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. రావివెంకటాంపల్లికి చెందిన భాస్కర్‌నాయుడు, నారాయణస్వామి పనినిమిత్తం బైక్‌లో యర్రగుంటపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. కాగా కొద్ది దూరం రాగానే వెనుకవైపు నుంచి తాడిపత్రికి చెందిన అబ్దుల్‌సత్తార్‌ మరో బైక్‌లో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో నారాయణస్వామి, భాస్కర్‌నాయుడులకు తీవ్రగాయాలు కాగా అబ్దుల్‌సత్తార్‌కు స్వల్పగాయాలయ్యాయి. భాస్కర్‌నాయుడు, నారాయణస్వామిలను అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం రూరల్‌, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌ కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్‌ కార్మికుల యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మున్సిపాలిటీ పాత కార్యాలయం నుంచి కొత్త కార్యాలయం వరకు కార్మికులతో కలిసి అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున, నాగరాజు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మున్సిపల్‌ పారిశుధ్య, ఇంజనీరింగ్‌ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటారన్నారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే దశలవారిగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్‌ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మున్సిపల్‌ యూనియన్‌ జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

బ్రహ్మసముద్రం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా నరేంద్ర కుమార్‌ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కసాపురంలో పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ పరశురాముడు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- సీపీఐ డిమాండ్‌

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్‌: జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ సీపీఐ, సీపీఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్‌ కార్యాలయాల వద్ద ఆందోళన చేసి తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. పలువురు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 31 మండలాలు కరువుతో అల్లాడుతున్నాయని, ఏడు మండలాలను మాత్రమే కరువు కింద ప్రకటించడం అన్యాయమని అన్నారు. తక్షణమే మిగిలిన మండలాలను కూడా కరువు కింద ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. గుంతకల్లు, గుత్తి, యాడికి ,ఉరవకొండ, కణేకల్లు, బొమ్మనహాళ్‌ ,తాడిపత్రిలలో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. కళ్యాణదుర్గంలో ఆర్డీఓకు అందించారు. పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామసచివాలయం వద్ద నిరసన తెలిపారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

గుత్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌ విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌ డాక్టర్‌ శోభాబిందు సూచించారు. పట్టణ శివారులోని గేట్స్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో కంప్యూటర్‌ సైన్స్‌, సీఎస్‌ఈ విద్యార్థులకు వారం రోజుల పాటు డెటా డైనమిక్స్‌ అనే అంశంపై వర్క్‌షాప్‌ నిర్వహించారు. సోమవారం ఆ కార్యక్రమం ముగింపు సందర్భంగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌ శోభాబిందు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో ప్రతీది డేటాపై ఆధారపడి ఉందన్నారు. డేటా అనలైజర్స్‌ ఆవశ్యకత భవిష్యత్తులో చాలా కీలకమన్నారు. అందుకే విద్యార్థులు నైపుణ్యతను నేర్చుకోవాలని, అప్పుడే ఉద్యోగాలు సాధించగలరని తెలిపారు. కరెస్పాండెంట్‌ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్‌ శ్రీవాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ సుధాకర్‌, సీఎస్‌ఈ విబాగాధిపతి నమ్రతా పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు చర్యలు

బెళుగుప్ప, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు చెరువుల సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు షర్మిల సోమవారం తెలిపారు. ఆమె ఇరిగేషన్‌ శాఖ ఎన్నికల అధికారి సుధాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో శ్రీరంగాపురం, గంగవరం, శీర్పి చెరువుల ఆయకట్టుదారుల సంఘాల ఎన్నికలు జరుగతాయన్నారు. ఇరిగేషన్‌ ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ ఆయకట్టుదారుల ఓటర్ల జాబితా గ్రామ సచివాలయాల్లో ఉంచుతామని, 12వ తేదీలోపు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలుపుకోవచ్చని సూచించారు. 13వ తేదీ తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వం ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తుందని పేర్కొన్నారు.

మాజీ సర్వేయర్‌ భూములపై విచారణ చేయాలి

కూడేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల మాజీ సర్వేయర్‌ రహబాషా కుటుంబ ప్రభుత్వ భూములపై విచారణ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు కొనకొండ్ల రాజేష్‌ డిమాండ్‌ చేశారు. రహబాషా మండలంలో సర్వేయర్‌గా పని చేసిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని, సర్వేయర్‌ కుటుంబ సభ్యుల పేరున ప్రభుత్వ భూములున్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఆయన సోమవారం అనంతపురం కలెక్టర్‌ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో డీఆర్వో మలోలకు వినతిపత్రం అందజేశారు. గతంలో పలుమార్లు విచారణ అనంతరం ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారని, భూములు మాత్రం అలాగే ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆయన డీఆర్వోను కోరారు.


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్‌

